# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 20 | సంచిక : 210 | సోమవారం 20, ఏప్రిల్ 2026 | పేజీలు: 04 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


## రేవంత్ రెడ్డి 70 సార్లు ఢిల్లీకి వెళ్లారు కానీ కల్లాలకు రారా..?

**ధాన్యం కొనుగోళ్లలో**
**అవ్యవస్థలపై హరీష్ రావు ఫైర్**
**మిల్లర్ల దోపిడీ.. రైతుల ఆవేదన వెల్లడి**
**రైతులు కల్లాల వద్ద తీవ్ర ఇబ్బందులు**
**నల్లగొండ జిల్లా గుర్రంపోడు**
**మండలం జూనూతల సందర్శన**
**ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన**
**సీఎం ఢిల్లీ పర్యటనలపై ఘాటు వ్యాఖ్యలు**
**సమస్యలు పరిష్కరించకపోతే**
**బీఆర్ఎస్ ఆందోళన హెచ్చరిక**

**హైదరాబాద్, (ప్రజా స్వరం ):**

రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ అస్తవ్యస్తంగా మారిందని, రైతులు కల్లాల వద్దే కన్నీరు మున్నీరవుతున్నారని మాజీ మంత్రి హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం జూనూతల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అక్కడ పేరుకుపోయిన ధాన్యం బస్తాలను పరిశీలించి రైతులతో ముఖాముఖి



# టార్గెట్ రేవంత్? మోడీ?

జగిత్యాలలో ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లు
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే లక్ష్యంగా
విమర్శనాస్త్రాలు సంధించే అవకాశం
కేసీఆర్ ప్రసంగంపై
రాజకీయ వర్గాలతోపాటు ప్రజల ఆసక్తి
ఇప్పటికే పూర్తయిన ఏర్పాట్లు
భారీ జనసమీకరణకు
పార్టీ శ్రేణుల కసరత్తు

**ఏడాది తర్వాత జనంలోకి వస్తున్న గులాబీ బాస్**



**హైదరాబాద్, (ప్రజా స్వరం ):**

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి పొలిటికల్ హీట్ పెరిగింది. ఒకే రోజు అధికార, ప్రతిపక్ష నేతల పర్యటనలు ఆసక్తిగా మారాయి. రేపు జగిత్యాలలో బహిరంగ సభకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ (KCR) హాజరు కాబోతుండగా అదే రోజు సీఎం రేవంత్ రెడ్డికాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఉన్న మేడిగడ్డ బ్యారేజీ పరిశీలనకు వస్తుండటం సంచలనం రేపుతోంది. అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య

..మిగతా 2లో



## జనగణనలో ఆదివాసీ మతం కాలమ్ పెట్టాలి

**కేంద్ర ప్రభుత్వం ఆదివాసీల హక్కులను హరిస్తోంది**
**PESA చట్టాన్ని బలహీనపరుస్తున్నారని విమర్శ**
**రాజ్యాంగ రక్షణలను తొలగించే ప్రయత్నం**
**మతం కేటగిరీలో "ఆదివాసీ" కాలమ్ లేదు**
**ఆదివాసీలు**
**తమ గుర్తింపును తెలిపే అవకాశం తగ్గింది**
**సంస్కృతికి అవమానం అని విమర్శ**
**ఆదివాసీల హక్కుల పరిరక్షణ అవసరం**
**కేంద్ర విధానాలపై తీవ్ర విమర్శలు**
**తక్షణ చర్యలపై కవిత డిమాండ్**

**హైదరాబాద్, (ప్రజా స్వరం ):**

కేంద్ర ప్రభుత్వం ఆదివాసీల హక్కులను హరిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. పెసా (PESA) చట్టానికి తూట్లు పొడుస్తూ రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూల్లోని రక్షణలను తొలగిస్తోందని ధ్వజమెత్తారు. జనగణనలో మతం కేటగిరిలో ఆదివాసీ అనే కాలమ్ పెట్టలేదని దీంతో ఆదివాసీలు తాము ఆదివాసీలమని సగర్వంగా చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఇది దేశ మూలవాసులైన ఆదివాసీల సంస్కృతిని అవమానించడమేనని జనగణనలో తమది ఆదివాసీ మతం అని చెప్పుకునేలా ప్రత్యేక కాలమ్ పెట్టడంతో పాటు ఆదివాసీల భాష 'కోయతూర్' ను భారత రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్ చేర్చాలని డిమాండ్ చేశారు. ఇవాళ కవితతో మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర, ఆల్ ఇండియా ఆదివాసీ కానిస్టిట్యూషనల్ రైట్స్ అండ్ కల్చరల్ ప్రొటెక్షన్ జేఏసీ నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలతో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను కవితకు

..మిగతా 2లో

## ఎండలు బాబోయ్.. ఎండలు

**45 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు.. ప్రజలు బెంబేలెత్తు**
**రాయలసీమలో రికార్డు స్థాయి వేడి, వడగాల్పుల హెచ్చరిక**
**తెలంగాణలో ఆరెంజ్ అలర్ట్.. జిల్లాలకు అప్రమత్తం**
**మూడు రోజుల్లో వర్షా లు.. స్వల్ప ఉపశమనం అవకాశం**

**హైదరాబాద్, (ప్రజా స్వరం ):**

వేసవి కాలం తన ప్రతాపాన్ని చూపిస్తోంది. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ , ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మునుపెన్నడూ లేని విధంగా మండిపోతున్నాయి. ఏప్రిల్ నెలలోనే ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును చేరువవుతుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 9 గంటలకే భానుడు తన ప్రతాపాన్ని మొదలుపెడుతుండగా, మధ్యాహ్న సమయానికి రోడ్లన్నీ జనసంచారం లేక కర్ఫ్యూను తలపిస్తున్నాయి. అటు వడగాల్పుల తీవ్రత కూడా

..మిగతా 2లో



## గవర్నర్‌తో సీఎం రేవంత్ కీలక భేటీ

**ఎమ్మెల్సీ నియామకాలు, డ్రగ్స్ నిరోధంపై విస్తృత చర్చ**
**పెండింగ్‌లో ఉన్న ఎమ్మెల్సీ ఫైళ్లపై నిర్ణయం కోరిన ప్రభుత్వం**
**కోదండరామ్, అజారుద్దీన్ పేర్ల ఆమోదంపై దృష్టి**
**మంత్రి పదవికి గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఉత్కంఠ**
**విద్యా రంగం, యువత భవిష్యత్తుపై చర్చల ప్రాధాన్యం**
**డ్రగ్స్ నివారణకు సంయుక్త కార్యాచరణ రూపకల్పన**
**విద్యార్థుల నుంచి ప్రమాణ పత్రాల ప్రతిపాదన**
**ఎల్బీ స్టేడియంలో భారీ అవగాహన కార్యక్రమానికి సిద్ధత**
**రాజ్యాంగపరమైన అంశాలపై అధికారుల వివరణలు**



**హైదరాబాద్, (ప్రజా స్వరం ):**

రాష్ట్ర రాజకీయ పరిణామాల్లో కీలక మలుపు తిరిగే అవకాశాలు కనిపిస్తున్న వేళ, రేవంత్ రెడ్డి గవర్నర్‌ను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. పెండింగ్‌లో ఉన్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలపై తక్షణ నిర్ణయం తీసుకోవాలని శివప్రతాప్ శుక్లాను కోరారు. ముఖ్యంగా ప్రొఫెసర్ కోదండరామ్, మహమ్మద్ అజారుద్దీన్ పేర్లను ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నియామకాలు ఆలస్యం అవుతున్న నేపథ్యంలో రాజకీయంగా, రాజ్యాంగపరంగా అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం మంత్రివర్గంలో

..మిగతా 2లో

## జగిత్యాల.. జంగ్ సైరన్!

**జీవన్‌రెడ్డి ఎపిసోడ్‌తో**
**కాంగ్రెస్ ముఖ్య నేతల్లో ఆందోళన**
**ఎవరు, ఎప్పుడు, ఎలాంటి**
**బాంబు పేలుస్తారోనన్న గుబులు**
**జిల్లాకు ఒకరిద్దరు అసమ్మతి**
**నేతలున్నారంటున్న పార్టీ వర్గాలు**
**వివిధ కారణాలతో పార్టీలో**
**ఇమడలేక.. వీడలేక సతమతం!**
**బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యేలున్న**
**చోట్ల అందరి పరిస్థితీ ఇదే**
**జీవన్‌రెడ్డి విషయంలో**
**అధిష్టానం, ముఖ్య నేతలు సరిగా**
**వ్యవహరించలేదనే భావన..**
**భవిష్యత్ పరిణామాలపై కలవరం**



**హైదరాబాద్, (ప్రజా స్వరం ):**

సీనియర్ నేత జీవన్‌రెడ్డి పార్టీని వీడటం, అందుకు దారి తీసిన పరిస్థితులు అధికార కాంగ్రెస్‌లో కొత్త చర్చకు దారి తీస్తున్నాయి. జగిత్యాల వేదికగా చోటు చేసుకున్న ఈ పరిణామం ఎటు తిరిగి ఎటు వెళుతుందోనన్న ఉత్కంఠ ఆ పార్టీ ముఖ్య నేతల్లో కనిపిస్తోంది. అంతర్గత ప్రజాస్వామానికి పెట్టింది పేరయిన పార్టీలో ఎవరు, ఎప్పుడు, ఎలాంటి బాంబు పేలుస్తారో.. ఎన్నికలు సమీపించే కొద్దీ జగిత్యాల అలజడి ఎలాంటి అసమ్మతి సుడిగుండాలను సృష్టిస్తుందోనన్న గుబులు అంతర్గతంగా వ్యక్తమవుతోంది.

జిల్లాకు ఒకరిద్దరు..!: కాంగ్రెస్‌లో అసంతృప్తులు, అసమ్మతులు సహజం. అయితే రాష్ట్రం పార్టీ అధికారంలో ఉండడం, భవిష్యత్తుపై ఆశలు ఉండడంతో చాలామంది నేతల్లో వివిధ కారణాలతో అసమ్మతి ఉన్నా పంటి బిగువున నెట్టుకొస్తున్నారనే వాదన ఉంది. తమ భవిష్యత్తు

..మిగతా 2లో

## తెలంగాణ ఏర్పాటును అడుగడుగునా బీజేపీ అవమానిస్తోంది

**తెలంగాణ విభజనపై**
**బీజేపీ వ్యాఖ్యలపై కడియం ఫైర్**
**భారత్-పాక్ పోలికపై తీవ్ర ఆగ్రహం**
**అభివృద్ధిలో కేంద్రం వివక్ష చూపిందా?**
**తెలంగాణ ఆత్మగౌరవంపై రాజకీయ వేడి**



**హైదరాబాద్, (ప్రజా స్వరం ):**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు , విభజన అంశంపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అనుసరిస్తున్న తీరుపై మాజీ మంత్రి కడియం శ్రీహరి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును బీజేపీ నాయకత్వం అడుగడుగునా అవమానిస్తోందని, వారి నిజ స్వరూపం తెలంగాణకు వ్యతిరేకమని ఆయన ధ్వజమెత్తారు. శనివారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, కేంద్ర ప్రభుత్వం , ప్రధాని మోదీ

..మిగతా 2లో

# రేవంత్ రెడ్డి 70 సార్లు ఢిల్లీకి వెళ్లారు కానీ కల్లాలకు రారా.?

మొదటిపేజీ తరువాయి



మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు పడుతున్న ఇబ్బందులను విన్న హరీష్ రావు, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.
ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని, మిల్లుల వద్ద లారీలు అన్ లోడ్ కాక రోజుల తరబడి రైతులు వేచి చూడాల్సి వస్తోందని హరీష్ రావు మండిపడ్డారు. తాలు, పచ్చ గింజ పేరుతో మిల్లర్లు వడ్లను తిరస్కరిస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. "ధాన్యంలో 5 కిలోల తరుగు తీస్తున్న వారి తోలు తీయాలి" అని ఆయన హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాలలో కనీస వసతులు లేవని, వర్షం వస్తే ధాన్యం తడిసి ముద్దవుతున్నా పట్టించుకునే నాథుడే లేడని ధ్వజమెత్తారు. వరి ధాన్యమే కాకుండా మొక్కజొన్న, జొన్న కొనుగోళ్లు కూడా అటకెక్కాయని, ప్రభుత్వం ఇప్పటివరకు వాటి ఊసే ఎత్తడం లేదని విమర్శించారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై హరీష్‌రావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "ముఖ్యమంత్రి 70 సార్లు ఢిల్లీకి వెళ్లారు కానీ, ఒక్కసారి కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి రైతుల కష్టాలను చూడలేదు" అని ఎద్దేవా చేశారు. అధికారులకు, ఎమ్మెల్యేలకు, మంత్రులకు రైతుల గోడు పట్టడం లేదని, తక్షణమే వారు క్షేత్రస్థాయిలో పర్యటించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. JJL 24433 వంటి దొడ్డు రకాలు , KNM సన్న రకాలను ప్రభుత్వం బేషరతుగా కొనుగోలు చేయాలని సూచించారు.
ప్రస్తుత ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని హరీష్ రావు విమర్శించారు. సన్న వడ్లకు బోనస్ రావడం లేదని, రైతు భరోసా ఇప్పటికీ అందరికీ అందలేదని, పంట బీమా ఊసే లేదని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయకపోతే, బీఆర్ఎస్ పార్టీ తరపున పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. రైతుల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం క్షేత్రస్థాయిలో ఉద్యమిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# టార్గెట్ రేవంత్ రెడ్డి? మోడీ?

మొదటిపేజీ తరువాయి



ఒకే రోజు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటనలు ఉండటంతో రాష్ట్రంలో మరోసారి మైండ్ గేమ్ మొదలైందా అనే చర్చ తెరపైకి వస్తోంది.

**ఏడాది తర్వాత పబ్లిక్ లోకి:**

కాంగ్రెస్ మాజీ నేత జీవన్ రెడ్డి కారెక్కేందుకు సిద్ధం అయ్యారు. ఈ నేపథ్యంలో జగిత్యాలలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తోంది. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత గులాబీ బాస్ కేసీఆర్ పబ్లిక్ లోకి రావడం లేదు. దాదాపు ఏడాది తర్వాత ఆయన బహిరంగ సభకు రాబోతున్నారు. గతేడాది ఏప్రిల్ 27న వరంగల్‌లో జరిగిన పార్టీ సిల్వర్ జూబ్లీ కార్యక్రమానికి హాజరైన కేసీఆర్ ఆ తర్వాత పబ్లిక్ మీటింగ్‌లకు ఎక్కడా హాజరు కాలేదు. అత్యంత ముఖ్యమైన కార్యక్రమాలు మినహా మిగతా అన్ని వ్యవహారాలు ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ నుంచే కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఏడాది తర్వాత రేపు జగిత్యాల సభకు కేసీఆర్ వస్తుండటం స్టేట్ పాలిటిక్స్‌లో ఆసక్తిగా మారింది.

**రేవంత్ రెడ్డి? మోడీ?:**

సుదీర్ఘ విరామం తర్వాత పబ్లిక్ మీటింగ్‌కు హాజరు కాబోతున్న కేసీఆర్.. ఈ సభ ద్వారా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయబోతున్నారు. అయితే ఇన్నాళ్లు పార్టీపై అధికార పక్షం తీవ్ర స్థాయిలో దాడి చేసినా మౌనంగా ఉన్న కేసీఆర్ జగిత్యాల సభ ద్వారా తన ప్రత్యర్థులకు ఎలాంటి కౌంటర్ ఇవ్వబోతున్నారు అనేది ఉత్కంఠగా మారింది. అసలు రేపటి సభలో ఆయన టార్గెట్ చేయబోయేది సీఎం రేవంత్ రెడ్డినా? లేక ప్రధాని మోడీనా అనేది సస్పెన్స్‌గా మారింది. ఇవేవి కాకుండా తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పరిణామాల దృష్ట్యా చంద్రబాబుపై విమర్శలు ఎక్కుపెడతారా అనేది వేచి చూడాలి.

**కేసీఆర్ వైఫల్యాలే టార్గెట్ రేవంత్ రెడ్డి స్కెచ్:**

ఇక కేసీఆర్ సభ రోజే సీఎం రేవంత్ రెడ్డి మేడిగడ్డ పర్యటనకు వెళ్తుండటం హాట్ టాపిక్‌గా మారింది. మేడిగడ్డ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో చూపించడంతో పాటు అక్కడికక్కడే బీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు కౌంటర్ ఇవ్వాలనేది రేవంత్ రెడ్డి ఆలోచనగా తెలుస్తోంది. ఇటీవలే కాళేశ్వరంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రేపు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సీఎం మేడిగడ్డను పరిశీలించబోతున్నారు. కాళేశ్వరం విషయంలో ఈసారి సీఎం డోస్ ఎలా ఉండబోతోంది అనేది ఆసక్తిగా మారింది.

# జనగణనలో ఆదివాసీ మతం కాలమ్ పెట్టాలి

మొదటిపేజీ తరువాయి

చందా లింగయ్య దొర వివరించారు.
వారి గౌరవాన్ని కాపాడేలా రాజకీయ పార్టీ:
ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆదివాసీల హక్కులను పరిరక్షించేందుకు ఆల్ ఇండియా ఆదివాసీ కానిస్టిట్యూషనల్ రైట్స్ అండ్ కల్చరల్ ప్రొటెక్షన్ జేఏసీ చేస్తున్న పోరాటానికి తెలంగాణ జాగృతి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం పాటు పడుతామని హామీ ఇచ్చారు. దేశంలోని 12 కోట్ల మంది ఆదివాసీలు నిజమైన భారత దేశ సంస్కృతికి ప్రతినిధులని వారి గౌరవాన్ని కాపాడేలా మేము ఏర్పాటు చేయబోయే రాజకీయ పార్టీ ఉంటుందన్నారు. పోలవరం ప్రాజెక్టులో 3 లక్షల మంది ఆదివాసీలను అడవి నుంచి దూరం చేస్తున్నారని కవిత ఆరోపించారు. తిరిగి వారికి అడవిలో అన్ని సౌకర్యాలతో కూడిన పునరావాసం కల్పించడం లేదని మండిపడ్డారు.



# జగిత్యాల.. 'జంగ్' సైరన్!

మొదటిపేజీ తరువాయి



ప్రస్తుతానికి గందరగోళంగా ఉన్నా కొంత కాలం తర్వాత అంతా సర్దుకుంటుందనే ఆశతో పార్టీలో ఉండలేక, వెళ్లలేక, సతమతమవుతున్నారు. ఇలాంటి నేతలు జిల్లాకు కనీసం ఒకరిద్దరున్నారని గాంధీభవన్ వర్గాలే అంటున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్‌లోకి వచ్చామని చెప్పుకుంటున్న నియోజకవర్గాల్లోని నేతలందరిదీ దాదాపు ఇదే పరిస్థితి. సింగాపురం ఇందిర, పి.విజయారెడ్డి, పొదెం వీరయ్య, భిక్షపతి గౌడ్, భీంభరత్, సరితాయాదవ్, కాట శ్రీనివాస్‌గౌడ్, కస్తూరి రాజేందర్ లాంటి నాయకులంతా గందరగోళ పరిస్థితుల్లోనే ఉన్నారు. వీరితో కనీసం మాట్లాడే వారు, సర్దిచెప్పేవారు కూడా లేరని అంటున్నారు. పదేళ్ల పాటు పార్టీని అంటి పెట్టుకుని ఉన్నామని, ఇప్పుడు ఏం చేయాలో కూడా పాలుపోవడం లేదని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఎన్నికల నాటికి తమ దారి తాము చూసుకుంటామనే హెచ్చరికలతో కూడిన అభిప్రాయాలను బయటకు చెప్పకపోయినా అంతర్గతంగా వ్యక్తం చేస్తున్నారు. తమ విషయంలో పార్టీ, నాయకత్వ వ్యవహారశైలిపై నిట్టూరుస్తూనే ఉన్నారు.

**ఆత్మహత్య చేసుకోవాలనిపించిందన్న చిన్నారెడ్డి**

సీనియర్ నేత చిన్నారెడ్డిది కూడా జీవన్‌రెడ్డి లాంటి పరిస్థితే. తనకు ఆత్మహత్య చేసుకోవాలని అనిపించిందనే స్థాయిలో ఆయన తన అసంతృప్తిని వెలిబుచ్చినా పార్టీ నాయకత్వం ఏ మాత్రం సీరియస్‌గా తీసుకోలేదనే విమర్శలున్నాయి. ఇక అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా గత ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్లు ఆశించి భంగపడినవారు, పోటీ చేసి ఓడిపోయిన వారు, నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న నేతలు... ఇలా అనేకమందిలో అసమ్మతి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొందరిని సముదాయించేందుకు డీసీసీ అధ్యక్షులుగా, కార్పొరేషన్ చైర్మన్లుగా నియమించినా లోలోన అసమ్మతి సెగలు మాత్రం అలాగే ఉన్నాయని అంటున్నారు. ముఖ్యంగా సమన్వయ లేమి కారణంగానే నాగం జనార్ధన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య లాంటి నేతలను దూరం చేసుకున్నామంటూ నెమరు వేసుకుంటున్నారు. జీవన్‌రెడ్డితో అధిష్టానం చర్చించి ఉంటే బాగుండేదని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వ్యాఖ్యానించడం, ఎంపీ మల్లు రవి కూడా ఆయన వెళ్లిపోవడం బాధాకరమే అన్న రీతిలో మాట్లాడటం గమనార్హమని చెబుతున్నారు.

**టేకిటీజీగా తీసుకున్నారా?**

వాస్తవానికి జీవన్‌రెడ్డి చాలా రోజులుగా అసంతృప్తి గళం వినిపిస్తున్నారు. 42 సంవత్సరాలుగా పార్టీలో కొనసాగుతున్న తనను కాదని, కనీసం తనకు చెప్పకుండా, తనపై గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేను పార్టీలోకి తీసుకున్నప్పుడే ఆయన భగ్గుమన్నారు. అప్పటి నుంచీ సందర్భమెప్పుడొచ్చినా ఆయన అసమ్మతి గళం వినిపిస్తూనే ఉన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీలో జగిత్యాల పంచాయతీ నడుస్తూనే ఉంది. చివరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గాంధీభవన్‌కు వచ్చి పార్టీ సమావేశంలో పాల్గొనడం, మున్సిపల్ ఎన్నికల సమయంలో జరిగిన పరిణామాలు, ఫలితాల అనంతరం పార్టీ తీసుకున్న నిర్ణయం లాంటివి జీవన్‌రెడ్డి సీనియారిటీ, సిన్సియారిటీపై ప్రశ్నలు లేవనెత్తేలా చేశాయనే భావన వ్యక్తమైంది. అయితే జీవన్‌రెడ్డి గురించి పార్టీలో అంతర్గతంగా చాలా చర్చ జరిగింది.
ముఖ్య నేతలు కలిసినప్పుడు, కరీంనగర్ రాజకీయాలు మాట్లాడినప్పుడు, పీఏసీ సమావేశాల్లోనూ ఆయన గురించి ప్రస్తావనలు వచ్చాయి. కానీ ఆయనే సర్దుకుంటారులే అన్న ధీమాతో పాటు ఇప్పుడు బయటకెళ్లి ఏం చేస్తారులే అనే అభిప్రాయమే చివరివరకు కొనసాగింది. పీసీసీ చీఫ్, సీఎం ఇద్దరూ టేకిటీజీ ధోరణిలోనే వెళ్లారనే భావన కొందరు వ్యక్తం చేయడం గమనార్హం. ఏతావాతా జీవన్‌రెడ్డికి సరైన భరోసా లభించలేదు. జగ్గారెడ్డి, మల్లు రవి మాదిరిగానే చివరి నిమిషంలో మంత్రి శ్రీధర్‌బాబు కూడా జీవన్‌రెడ్డిని వెళ్లనివ్వకుండా ఆపాలని పార్టీ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. చాలామంది నేతలు జీవన్‌రెడ్డిని పార్టీ విడిచిపెట్టదనే అనుకున్నారు. కానీ జీవన్‌రెడ్డి నాలుగు దశాబ్దాల అనుబంధాన్ని వదులుకున్నారు. ఇది బాధాకరమే అయినప్పటికీ తప్పడం లేదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. చివరకు బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు.

# గవర్నర్‌తో సీఎం రేవంత్ కీలక భేటీ

మొదటిపేజీ తరువాయి

కొనసాగుతున్న మహమ్మద్ అజారుద్దీన్ పరిస్థితి ఈ అంశాన్ని మరింత కీలకంగా మార్చింది. ఆయన ఎలాంటి సభకు సభ్యుడు కాకుండానే మంత్రి పదవిలో కొనసాగుతున్నారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం, ఆరు నెలల్లోపు శాసనసభ లేదా శాసన మండలిలో సభ్యత్వం పొందాల్సి ఉంటుంది. ఈ గడువు ఈ నెలాఖరుతో ముగియనున్న నేపథ్యంలో, ఎమ్మెల్సీగా నియామకం జరగకపోతే మంత్రి పదవి కోల్పోయే పరిస్థితి ఏర్పడే అవకాశముంది. దీంతో ఈ అంశంపై ప్రభుత్వం అత్యవసరంగా చర్యలు తీసుకుంటోంది.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కార్యాలయం తరపున గవర్నర్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. ఇప్పటికే ఉన్న సాంకేతిక అడ్డంకులు తొలగిపోయాయని, వెంటనే ఫైళ్లపై ఆమోద ముద్ర వేయాలని అభ్యర్థించారు. దీనికి ముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ జనరల్ కూడా గవర్నర్‌ను కలిసి రాజ్యాంగపరమైన అంశాలపై వివరణ ఇచ్చినట్లు సమాచారం. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారి తీస్తున్నాయి.
ఈ భేటీ కేవలం రాజకీయ నియామకాలకే పరిమితం కాలేదు. రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన కీలక అంశాలు కూడా చర్చకు వచ్చాయి. ముఖ్యంగా విద్యా రంగం, యువత సమస్యలు, మాదకద్రవ్యాల వ్యాప్తి వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో పెరుగుతున్న డ్రగ్స్ సమస్యపై ఆందోళన వ్యక్తం చేస్తూ, దాన్ని నిర్మూలించేందుకు సంయుక్త కార్యాచరణ అవసరమని అభిప్రాయం వ్యక్తమైంది.విద్యార్థులను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటానికి కొత్త చర్యలను పరిశీలించారు. విద్యాసంస్థల్లో అడ్మిషన్ సమయంలోనే విద్యార్థుల నుంచి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రమాణ పత్రాలు తీసుకోవాలని గవర్నర్ సూచించారు. ఇది విద్యార్థుల్లో అవగాహన పెంచడమే కాకుండా, బాధ్యతను కూడా కలిగిస్తుందని భావిస్తున్నారు. విద్యాసంస్థల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.
ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. జూన్ 12న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, యువతలో డ్రగ్స్ ప్రమాదాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమం నిర్వహణపై కూడా భేటీలో చర్చించారు.విద్యారంగంలో మౌలిక వసతుల అభివృద్ధి, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీ, ఉన్నత విద్యా ప్రమాణాల మెరుగుదల వంటి అంశాలు కూడా చర్చకు వచ్చాయి. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా విద్యాసంస్థల పనితీరు మెరుగుపడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ విధానాలు యువతకు ఉపయోగపడేలా ఉండాలని సూచించారు.
గవర్నర్ సూచనలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యార్థుల నుంచి ప్రమాణ పత్రాలు తీసుకోవడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి చర్యలను త్వరలో అమలు చేస్తామని తెలిపారు. జూన్‌లో జరిగే భారీ కార్యక్రమానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ భేటీ రాష్ట్ర రాజకీయ, పరిపాలనా రంగాల్లో కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది. ఒకవైపు ఎమ్మెల్సీ నియామకాలపై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉండగా, మరోవైపు యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి ఉంది. ఈ రెండు అంశాలు రానున్న రోజుల్లో రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.



# ఎండలు బాబోయ్.. ఎండలు

మొదటిపేజీ తరువాయి

తోడవడంతో సామాన్యుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.
ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతం ప్రస్తుతం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. నంద్యాల జిల్లా సంజామలలో అత్యధికంగా 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదై రికార్డు సృష్టించింది. ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ సుమారు 100 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. అటు తెలంగాణలోనూ పరిస్థితి ఏమాత్రం భిన్నంగా లేదు. నిజామాబాద్, ఆదిలాబాద్, నల్గొండ వంటి జిల్లాల్లో ఎండలు మండిపోతున్నాయి. ఎండల తీవ్రత దృష్ట్యా వాతావరణ శాఖ తెలంగాణలోని పలు జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేస్తూ ప్రజలను అప్రమత్తం చేసింది.
ఎండల తీవ్రత , వడదెబ్బ బారి నుండి రక్షణ పొందేందుకు నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకపోవడం ఉత్తమం. శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండేందుకు మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలను తరచూ తీసుకోవాలి. వడదెబ్బ తగలకుండా ఉండేందుకు లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలి. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు లేదా టోపీని తప్పనిసరిగా వాడాలి.
ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు వాతావరణ శాఖ ఒక చిన్న ఊరటనిచ్చే వార్తను కూడా అందించింది. రాబోయే మూడు రోజుల్లో తెలంగాణ , ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీనివల్ల ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గి, వేడి నుండి కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది. అప్పటివరకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



# తెలంగాణ ఏర్పాటును అడుగడుగునా బీజేపీ అవమానిస్తోంది

మొదటిపేజీ తరువాయి



గతంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ నిప్పులు చెరిగారు.
తెలంగాణ విభజనను భారత్‌పాకిస్తాన్ విడిపోవడంతో పోల్చడం అత్యంత దుర్మార్గమని కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. పార్లమెంట్ సాక్షిగా ఇటువంటి తెలివిలేని మాటలు మాట్లాడటం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటునే బీజేపీ జీర్ణించుకోలేకపోతోందని, అందుకే అడుగడుగునా విషం చిమ్ముతున్నారని విమర్శించారు.
కేంద్రంలో పదేళ్లకు పైగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి చేసిందేమీ లేదని కడియం శ్రీహరి ధ్వజమెత్తారు. గడిచిన 12 ఏళ్ల కాలంలో తెలంగాణకు ఒక్కటంటే ఒక్క జాతీయ ప్రాజెక్టు కూడా ఇవ్వలేదని, నిధుల కేటాయింపులోనూ తీవ్ర వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. అభివృద్ధి గురించి మాట్లాడకుండా, కేవలం రాష్ట్ర విభజనపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే బీజేపీ పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను, అనేక మంది బలిదానాలను కించపరిచేలా బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారని, దీనికి ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. బీజేపీ నిజంగా తెలంగాణకు అనుకూలమైతే ఇక్కడి ప్రాజెక్టులకు ఎందుకు నిధులు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు.

# బిజెపికి మహిళా రిజర్వేషన్ బిల్లు పై చిత్తశుద్ధి లేదు.. అంచనూరి రాజేష్

**ప్రజా స్వరం నార్సింగి ఏప్రిల్ 19**

బీజేపీ మహిళా బిల్లు పై ప్రతిపక్షాల పై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని టెలికాం బోర్డు మాజీ సభ్యుడు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడు అంచనూరి రాజేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నార్సింగి ఉప సర్పంచ్ యెన్నం రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుల తో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ ఇండియా కూటమి పై చేస్తున్న అబద్ధపు ప్రచారాలు వాస్తవ దూరమని అన్నారు. ప్రతిపక్షాలు అడ్డుకున్నది మహిళా బిల్లు చాటున మోసపూరితంగా తెచ్చిన ఇతర రాష్ట్రాలకు అన్యాయం చేసే డెలిమిటేషన్ బిల్లేనని, బీజేపీ మోసాన్ని పసిగట్టిన ఇండియా కూటమి బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసి బిల్లును అడ్డుకోవడం హర్షణీయం అని అన్నారు. ఎన్డీఏ కు మహిళా రిజర్వేషన్ల పై చిత్త శుద్ధి ఉంటే ప్రస్తుతం ఉన్న సీట్లలో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీ మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. అనంతరం



దుబ్బాక లో జరిగిన కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా చెరుకు సమక్షంలో నార్సింగి పట్టణ కేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కుమ్మరి మహేష్ కాంగ్రెస్ కండువా వేసుకుని కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై చేరినట్లు తెలిపారు. మండలం లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్, సుధాకర్, రుక్మొద్దీన్, బాచి స్వామి, మోతీలాల్, ప్రభాకర్, కటికే రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మల్కాపూర్ లో స్వచ్చా భారత్....

**తూప్రాన్ ఏప్రిల్ 19 (ప్రజా స్వరం )**

మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో 397వ ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. 4వ వార్డులో పరిసర ప్రాంతాలలో ప్లాస్టిక్ ను, చెత్తాచెదారాన్ని తొలగించారు. సిసి రోడ్లను చీపుర్లతో ఊడ్చి శుభ్రపరచారు. గ్రామం శుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యం తో ఉంటారని ఆయన అన్నారు గ్రామ ప్రజల సహకారంతో గ్రామాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వామి, వార్డు సభ్యులు, జిన్న కృష్ణ, వేణుగోపాల్ , తిరుపతి, అంగన్వాడి టీచర్లు స్వర్ణలత, లావణ్య, వివో ఏ సంతోష, ఆశ వర్కర్ ఇందిరా,మేకిన్ యువత, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.




# ఆలయ నిర్మాణానికి 51వేలను విరాళంగా ఇచ్చిన రామన్నగారి రాఘవేందర్ గౌడ్

**(ప్రజాస్వరం),మేడ్చల్ :**

జిహెచ్ఎంసి పరిధిలోని పూడూర్ కిష్టాపూర్ డివిజన్ కిష్టాపూర్ గ్రామంలోని అర్చన కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న నల్ల పోచమ్మ ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ ఆదివారం 51 వేల రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు రాఘవేందర్ గౌడ్ ను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు. రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తనవంతుగా సహాయం చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. మేడ్చల్ సర్కిల్ పరిధిలో తన దృష్టికి వచ్చిన పలు సమస్యలను సొంత నిధులతో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చన కాలనీ సేవా సమితి అసోసియేషన్ అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు బుచ్చి రాములు, కాలనీవాసులు హనుమంత్ రెడ్డి, మల్లారెడ్డి, మెట్టు రాజు, కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రారంభం శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర మహోత్సవం

**తూప్రాన్ ఏప్రిల్ 19( ప్రజా స్వరం )**

మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని మహంకాళి దేవాలయం ఆవరణలో గల శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ సందర్భంగా తూప్రాన్ గౌడ సంఘం ఆధ్వర్యంలో నేడు గోమాత పూజతో ఘనంగా ప్రారంభించారు మధ్యాహ్నం లద్ద పుట్ట మట్టి బంగారు పూజ ఎదుకోళ్ల కార్యక్రమం నిర్వహించారు సాయంత్రం పోచమ్మ బోనాలు ఏర్పాటు చేసి భారీ ఊరేగింపుగా ఆలయానికి బయలుదేరి వెళ్తున్నారు బ్రాహ్మణ ఎల్లమ్మకు ప్రతి ఐదు సంవత్సరాలకుఒక్కసారి శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణము మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు మూడు రోజులపాటు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు డప్పు చప్పులతో ఏర్పుల బైండ్ల వారి విన్యాసాల మధ్య ఘనంగా పోచమ్మ బోనాల నిర్వహించారు సోమవారం ఉదయం ఆలయం ఆవరణలో కుంకుమార్చన ఉంటుందని మహిళలు భారీగా పాల్గొన్నారు అనంతరం ఇండ్లలో సత్యనారాయణ వ్రతాలు ఏర్పాట్లు చేసుకోవాలని గౌడ సంఘం సభ్యులకు తెలియజేశారు మంగళవారం రోజు శ్రీ రేణుకా మాత కళ్యాణం అనంతరం అన్న ప్రసాదం ఉంటుందని సాయంత్రం 6 గంటలకి ఎల్లమ్మ బోనాలు శివసత్తులు నృత్యాల డప్పు చప్పట్లు బ్యాండ్ మేళాలు ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు



# మాందాపూర్ అంగన్వాడీలో పోషణ్ పక్వాడ్.. టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ

**జగదేవ్ పూర్ ,ఏప్రిల్19, (ప్రజాస్వరం )**

జగదేవ్ పూర్ మండల పరిధిలోని మాందాపూర్ అంగన్వాడీ కేంద్రంలో 'పోషణ్ పక్వాడ్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు మరియు చిన్న పిల్లలకు అందించాల్సిన పోషకాహార ప్రాముఖ్యతపై తల్లులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ ఐసీడీఎస్ సీడీపీఓ సరిత , సూపర్వైజర్ సంతోష ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. అంగన్వాడీ సేవల డిజిటలైజేషన్లో భాగంగా ఇదే వేదికపై టీచర్లకు స్మార్ట్ ఫోన్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో మాందాపూర్ సర్పంచ్ లింగాల మౌనిక ముత్యం, పలుకుగడ్డ సర్పంచ్ నర్రా కనకయ్య, ఉప సర్పంచులు నర్రా రాములు, నర్రా కళ్యాణి, వార్డు సభ్యులు నర్రా నవీన్, నర్రా సురేష్, ఎం. హేమలత పాల్గొన్నారు. అలాగే తీగుల్ పీహెచ్సీ డాక్టర్, గ్రామ ఆశా వర్కర్ స్వప్న మరియు అంగన్వాడీ సిబ్బంది పాల్గొని ఆరోగ్య సూత్రాలను వివరించారు.



# ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**(ప్రజాస్వరం) మేడ్చల్:**

అక్షయ తృతీయను పురస్కరించుకొని ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో మేడ్చల్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎల్ఐసి ఏజెంట్ తాళ్లపల్లి నాగేష్ మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో మజ్జిగ పంపిణీ ప్రజలకు ఎంతో ఉపయోగపడతుందని ,మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య యువజన సంఘ నేతలను అభినందిస్తున్నట్లు వారు తెలిపారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాలకు తన మద్దతు ఎప్పుడు ఉంటుందని, ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఈ మజ్జిగ పంపిణీ ని ప్రతి శని, ఆది వారాలలో ప్రజలు వినియోగించుకోవాలని ఎల్ఐసి ఏజెంట్ తాళ్లపల్లి నాగేష్ కోరారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు వెంకట్ ,ప్రధాన కార్యదర్శి నాగేష్, కోశాధికారి అవినాష్, ఉపాధ్యక్షుడు అఖిల్, సంపత్,శ్రావణ్, అరుణ్,సంతోష్,సద్గున్, చంద్ర శేఖర్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి 55వ పుట్టినరోజు వేడుకలు..



**ప్రజా స్వరం నార్సింగి ఏప్రిల్ 19**

కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి 55 వ జన్మదిన వేడుకలు నార్సింగి మండల కేంద్రం లోని ఎస్బీఐ బ్యాంక్ చౌరస్తా వద్ద నార్సింగి ఉపసర్పంచ్ యెన్నం రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేకు కోసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ అలనాటి మేటి నాయకుడు స్వర్గీయ చెరుకు ముత్యం రెడ్డి తనయుడు చెరుకు శ్రీనివాస్ రెడ్డి అసలైన రాజకీయ వారసుడని అన్నారు. ముత్యం రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ పేద, బడుగు వర్గాలకు ఎలాంటి కష్టం వచ్చినా తాను ఉన్నానని సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్నారని కొనియాడారు. శ్రీనివాస్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరేన్నో జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో విరాజిల్లుతూ రాజకీయంగా మరింత ఎత్తుకు ఎదగాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ప్రైవేట్ ఆసుపత్రి లోని రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్, మండల ఫిషర్మెన్ అధ్యక్షుడు సుధాకర్, ఏఎంసీ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, రఫీక్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు రాజేష్, మాజీ ఉపసర్పంచ్ రుక్మొద్దీన్, పార్టీ జిల్లా నాయకుడు బాలరాజు గౌడ్, నాయకులు శంకర్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, జహీర్, ఎం కె రాజు, చందు యాదవ్, మోతి లాల్, బాబా గౌడ్, రాజేశ్వర్ గౌడ్, దొంతి స్వామి, మైలారం మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# తూప్రాన్ లో బిజెపి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

**తూప్రాన్ ఏప్రిల్ 19( ప్రజా స్వరం**


తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోనర్సాపూర్ చౌరస్తా లోని శివాజీ విగ్రహం వద్ద భారతీయ జనతా పార్టీ తూప్రాన్ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ ను దహనం చేశారు.. ఆదివారం తూప్రాన్ నర్సాపూర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదలు చేశారు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వర్గంటి రామ్మోహన్ గౌడ్, తూప్రాన్ మున్సిపల్ శాఖ అధ్యక్షులు భూమన్న గారి జానకిరామ్ గౌడ్ ఆధ్వర్యంలో తూప్రాన్ మున్సిపల్ బిజెపి కౌన్సిలర్లు మన్నే స్వామి,చందాఅశోక్ యాదవ్, సిద్ధిరాములు, మెదక్ జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు సంఖ్య యాదగిరి, దేవత సాయికిరణ్ అడ్వకేట్, బద్రి, సంపత్ గౌడ్, రాకేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు



# మెదక్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గా పల్లెర్ల రవీందర్ గుప్త....

**తూప్రాన్ ఏప్రిల్ 19 (ప్రజా స్వరం )**

మెదక్ జిల్లా ఆర్య వైశ్య మహాసభ నూతన కార్యవర్గం తూప్రాన్ లో సమావేశం ఏర్పాటు చేసి తూప్రాన్ కు చెందిన పల్లెర్ల రవీందర్ గుప్త ను ఎకగ్రీవంగా ఎన్నుకొని ప్రమాణస్వీకారం చేశారు ప్రధాన కార్యదర్శి గా బుక్క అశోక్ ను నియమించారు కార్యవర్గం...సుదం మల్లేశం గుప్త గౌరవ అధ్యక్షులు మధుమల అశోక్ గుప్త కోశాధికారి వెంకటనారాయణ అదనపు ప్రధాన కార్యదర్శి పుండరికం ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్ర శేఖర్ శ్రీనివాస్ లు ఉపాధ్యక్షులుగా వెంకటేశం శంకర్ లు పి ఆర్ ఓ లుగా రాజేందర్ నవీన్ కుమార్ రాజేశ్వర్ లు డివిజన్ కార్యదర్శులు గా ప్రమాణ స్వీకారం చేశారు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర శాఖ కార్యక్రమం లు తుచ్చా తప్పకుండ పాటించాలని రాష్ట్ర నాయకులు తెలిపారు



# మహిళా బిల్లుపై బీజేపి రాజకీయ కుట్ర

- రాష్ట్ర క్రైస్తవ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్

**సికింద్రాబాద్, ఏప్రిల్ 19 (ప్రజా స్వరం ):**

మహిళా రిజర్వేషన్ బిల్లును నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియతో ముడిపెట్టడం వెనుక కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వానికి స్పష్టమైన రాజకీయ అజెండా ఉందని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం సికింద్రాబాద్ పద్మారావు నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దీపక్ జాన్ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలనే నిజమైన సంకల్పం కేంద్ర ప్రభుత్వానికి లేదని విమర్శించారు. పార్లమెంట్ స్థానాల పెంపు పేరుతో డీలిమిటేషన్‌ను సాకుగా చూపుతూ, ఈ బిల్లును ఏళ్ల తరబడి ఆలస్యం చేయాలనే దురుద్దేశంతో బీజేపీ వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు. బయటకు మహిళా సాధికారతపై గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ, ఆచరణలో మాత్రం కేంద్రం అడుగు ముందుకు వేయడం లేదని విమర్శించారు. డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా ముఖ్యంగా



దక్షిణాది రాష్ట్రాలకు భారీ నష్టం కలిగించేలా కేంద్రం కుట్ర పన్నుతోందని దీపక్ జాన్ ఆరోపించారు. జనాభా నియంత్రణలో ఆదర్శంగా నిలిచిన రాష్ట్రాలకు ఇది కోలుకోలేని అన్యాయమని, ఉత్తరాది రాష్ట్రాలకు రాజకీయంగా అధిక ప్రాధాన్యం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సమగ్ర అభివృద్ధిని దెబ్బతీసేలా ఉన్న ఇలాంటి వివక్షాపూరిత విధానాలను సహించేది లేదన్నారు. రాబోయే సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మహిళలను, ప్రజలను మరోసారి మోసం చేసే ప్రయత్నంగా బీజేపీ ఇలాంటి జిమ్మిక్కులకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ప్రజలు ఇప్పుడు చైతన్యవంతులై ఉన్నారని, బీజేపీ పన్నుతున్న రాజకీయ కుట్రలను తిప్పికొట్టే శక్తి ప్రజలకు ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశ ప్రథమ పౌరురాలైన రాష్ట్రపతికే తగిన గౌరవం ఇవ్వని కేంద్ర ప్రభుత్వం, సాధారణ మహిళల హక్కులను ఏ విధంగా కాపాడుతుందో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల అంశంలో కేంద్రం అనుసరిస్తున్న మొండి వైఖరిని అందుకే ఇండియా కూటమి గట్టిగా వ్యతిరేకించిందని స్పష్టం చేశారు. మహిళలకు నిజమైన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే చిత్తశుద్ధి ఉంటే, డీలిమిటేషన్ అనే అడ్డంకిని తొలగించి బిల్లును వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# దౌలాపూర్ లో చలివేంద్రం ప్రారంభం

- సర్పంచ్ కుకునూరి కృష్ణ

**ప్రజా స్వరం గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**



జగదేవపూర్ మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామం లో సర్పంచ్ కుకునూరి కృష్ణ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణ మాట్లాడుతూ మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండ తీవ్రత నుండి ఉపశమానం కలిగించడానికి బాటసారుల దాహార్తిని తీర్చడానికి దాతలు స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వాలు ఏర్పాటు చేసే ఉచిత మంచినీటి కేంద్రమే చలివేంద్రం. చలివేంద్రం సాధారణంగా మట్టి కుండలాల్లోని చల్లని నీరు లేదా మజ్జిగను అందస్తారు. ఇవి రద్దీ ప్రదేశాలలో బస్టాండ్ కూడళ్ళల్లో వీటిని ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చడం కోసం ఎంతో ఉపయోగం పడతాయాన్ని చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషం ఉందని అన్నారు.ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ పోకల రాంచంద్రం వార్డు సభ్యులు జూపల్లి మధు జూపల్లి బంగారి మాజీ ఎంపిటీసీ కొన్నే జయమ్మ బొల్లు మహేష్ కేశమైన రాజయ్య మ్యాడమైన సిద్దులు మంత్రి జయరాములు అనేమైన కనకయ్య కేశపురం బాల్ నర్సయ్య ఆకారం అయోధ్య ఆకారం నర్సింలు తీర్మాలపురం నర్సింలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుడి నోటికాడ కూడు తీసిన జీహెచ్ఎంసీ..

- బల్కంపేట శివ్‌బాగ్ చౌరస్తాలో దౌర్జన్యం!

**సికింద్రాబాద్, ఏప్రిల్ 19(ప్రజా స్వరం ):**




అభాగ్యులకు అండగా ఉండాల్సిన సర్కారు యంత్రాంగం, ఒక వికలాంగుడి 26 ఏళ్ల జీవనాధారాన్ని కనికరం లేకుండా నేలమట్టం చేసింది. నగరంలోని శివ్‌బాగ్ చౌరస్తాలో ఏళ్ల తరబడి ఫోన్ బూత్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న వికలాంగుడు దాసరి వెంకటేష్‌పై జీహెచ్ఎంసీ అధికారులు ప్రతాపం చూపారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, కనీసం ప్రత్యామ్నాయం చూపకుండా ఒక్కరోజులోనే ఆ డబ్బాను ధ్వంసం చేయడం స్థానికంగా కలకలం రేపుతోంది. స్ట్రీట్ వెండర్స్ చట్టం 2014 ప్రకారం వీధి వ్యాపారులకు రక్షణ ఉన్నప్పటికీ, ఆ చట్టాలను తుంగలో తొక్కి అధికారులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘోర అన్యాయంపై మానవ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మనేని తీవ్రంగా స్పందించారు. ఒక వికలాంగుడి జీవన హక్కును కాలరాయడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ని ఉల్లంఘించడమేనని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో (TSHRC) అధికారుల దుర్మార్గంపై ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి, ఒక కుటుంబాన్ని రోడ్డున పడేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితుడికి తక్షణమే నష్టపరిహారం చెల్లించడంతో పాటు, ప్రత్యామ్నాయ వ్యాపార స్థలాన్ని కేటాయించాలని బాధితుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రజాస్వామ్యంలో బలహీనులకు రక్షణ కరువైందని, అధికారుల హైహ్యాండెడ్‌నెస్‌కు అడ్డుకట్ట వేయాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

# మృతురాలి కుటుంబానికి జై భీమ్ యూత్ అండ

- 50 కిలోల బియ్యం ఆర్థిక సహాయం

**ప్రజా స్వరం గజ్వేల్ ప్రతినిధి :**

జగదేవపూర్ మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన కొండాపూరం ఉమారాణి కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత నిరుపేద మృతురాలి కుటుంబానికి తమ వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. మృతురాలి కుటుంబాన్ని పరమశించి మనోధైర్యాన్ని చెప్పి భాధితకుటుంబానికి 50 కిలోల బియ్యం కుటుంబ సభ్యులకు సహాయం చేశారు. జై భీమ్ యూత్ అధ్యక్షులు ఆకారం మహేందర్ మాట్లాడుతూ దౌలాపూర్ గ్రామ నిరుపేద కుటుంబాలకు ఎల్లప్పుడూ మా జై భీమ్ యూత్ అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కేశపురం పెద్దులు, ముక్కెర విక్రమ్, ఆకారం ప్రశాంత్, మల్లేష్, కోలిపాక హరి,ఆకారం బాబు, తిర్మలాపూరం తిరుపతి, ముక్కెర రాముల, ముక్కెర పెద్ద నర్సింహులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# బల్కంపేట ఎల్లమ్మ ఆశీస్సులు..

- మైదానంలో చెలరేగిన అభిషేక్ శర్మ!
- 22 బాల్స్లో 59 రన్స్...ఇది దైవిక ఇన్నింగ్స్ అంటున్న ఫ్యాన్స్...

**సికింద్రాబాద్,ఏప్రిల్ 19 ( ప్రజా స్వరం ):**

ఆటగాడి ప్రతిభకు దైవబలం తోడైతే ఫలితం ఎలా ఉంటుందో బల్కంపేట ఎల్లమ్మ సాక్షిగా నిరూపితమైంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నాడు. కాని ఇటీవల కొన్ని మ్యాచ్లో అంతగా రాణించడం లేదు. కీలక మ్యాచ్‌లకు ముందు హైదరాబాద్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రం బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఈ యువ బ్యాటర్, మైదానంలో పరుగుల వరద పారిస్తూ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు.వివరాలు ఇవి... అభిషేక్ శర్మ శుక్రవారం బల్కంపేట రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాదాపు అరగంట పాటు ఆలయంలో గడిపి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఆధ్యాత్మిక పర్యటన తర్వాత రోజు శనివారం చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో ఆయన ఆడిన తీరు అభిమానులను మంత్రముగ్ధులను చేసింది. కేవలం 22 బాల్స్లో 59 రన్స్ చేశారు. ఎక్కడా తడబాటు లేకుండా క్లాసిక్ షాట్లతో విరుచుకుపడుతూ, బౌండరీల వర్షం కురిపిస్తున్న తీరు చూస్తుంటే.. అతడిపై ఆ అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉన్నాయని క్రీడాభిమానులు చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా సన్‌రైజర్స్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న అభిషేక్, తన ఫామ్ వెనుక కఠోర శ్రమతో పాటు దైవకృప కూడా ఉందని బలంగా నమ్ముతున్నాడు. అమ్మవారి దర్శనం తనకు మానసిక ప్రశాంతతను, ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. భక్తి, పట్టుదల కలిస్తే విజయాలు వాటంతట అవే వస్తాయని ఈ 'కాటేరమ్మ కొడుకు' ప్రదర్శన మరోసారి చాటిచెప్పింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో అభిషేక్ శర్మ ఆలయ సందర్శన ఫోటోలు, ఆయన మెరుపు ఇన్నింగ్స్ వీడియోలు వైరల్‌గా మారాయి.






# దరువు జాతర ను విజయవంతం చేయండి



- తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన దరువు
- పోస్టర్ ఆవిష్కరించిన జగదేవపూర్ మండల సర్పంచ్ లు

**ప్రజా స్వరం గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి:**

దరువు సాంస్కృతిక చైతన్య వేదిక పురుడుపోసుకొని 25సంవత్సరాలు అయిన సందర్భంగా ఈనెల 20న రవీంద్ర భారతి హైదరాబాద్ లో దరువు జాతర వాల్ పోస్టర్ ను జగదేవపూర్ మండల సర్పంచ్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట లో 1999 లో దరువు కళాబృందం ఏర్పడి జ్యోతిరావు పూలె అంబేద్కర్ ఆశయాలతో సామజిక గీతాలు, మహనీయుల గీతాల తో ప్రజలను చైతన్యం చేసింది తెలంగాణా రాష్టం సాధించడంలో దరువు సాంస్కృతిక చైతన్య వేదిక ప్రధానభూమిక పోషించింది. దరువు ఎల్లన్న రాసిన విరులారా వందనం పాట తెలంగాణ రాష్టం నలుమూలల ప్రజలను విద్యార్థులను చైతన్యం చెసి రాష్టం సాధించడంలో దరువు పాత్ర కీలకంగా ఉంది. దరువు ప్రారంభించి 25ఏండ్లు అయిన సందర్భంగా ఈనెల 20న రవీంద్ర భారతి హైదరాబాద్ లో జరిగే దరువు జాతర కు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎల్లేష్ అలిరాజపేట, నర్ర కనకయ్య పలుగుగడ్డ, క్యాసారం కుమార్ అనంతసాగర్, చెక్కల పరమేశ్వర్ బి. జి వెంకటాపూర్, పోసన్నపల్లి రాజు తిమ్మాపూర్, సోప్పరి పుష్ప తానేష్ కొండాపూర్, తుమ్మల జ్యోతి మహేష్ కొత్తపేట, నర్సల్ల దిన రాజలింగం ఇటిక్యాల, బునారి రజిత మల్లేశం రాంనగర్, ఏలూరుసంధ్య శ్రీనివాస్ తీగుల్ నర్సాపూర్, పీర్లపల్లి ఉప సర్పంచ్ మల్లికార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి పేద విద్యార్థులకు చేయూత

- పద్మశాలి సేవా సంఘం గజ్వేల్- ప్రజ్ఞాపూర్ అధ్యక్షుడు బోల్లిబత్తుల దేవదాస్

**ప్రజా స్వరం గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ గ్రామంలో పద్మశాలి కుల బాంధవుడు సామల శ్రీదేవి, నర్సింలు కుమారుడు ప్రణయ్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం లో రాష్ట్ర మొదటి ర్యాంకు సాధించినందుకు పద్మశాలి సేవా సంఘం తరపున సామల ప్రణయ్ నీ అభినందించి, శాలువాతో సత్కరించి, నగదు పారిదోషికముగా మూడు వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు బోల్లిబత్తుల దేవదాసు మాట్లాడుతూ గత ఆరు నెలల క్రింద ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పద్మశాలి కులంలో పేద విద్యార్థిని, విద్యార్థులకు చేయూత కార్యక్రమంలో భాగంగా ఈరోజు సాముల ప్రణయ్ రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించినందుకు పద్మశాలి కులానికే గర్వకారణం అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థిని, విద్యార్థులకు మేము ఎల్లప్పుడూ అండగా ఉంటామని వారికి సలహాలు సూచనలు ఇవ్వడానికి పిల్లలలో సృజనాత్మకత శక్తిని ప్రోత్సహించడానికి కృషి చేస్తామన్నారు. ఉన్నత చదువులు చదవడం వల్ల వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని, కొంతమంది కుటుంబ ఆర్థిక స్తోమత లేక చదువులు మధ్యలో ఆపివేసిన వారూ మానసికంగా కృంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటివారికి పద్మశాలి సేవ సంఘం చేదోడు,వాదోడుగా ఉండి వారిని ప్రోత్సహించడానికి భవిష్యత్ ప్రణాళికలు తయారు చేస్తున్నమని, పేద విద్యార్థిని, విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు మధ్యలో ఆగిపోతే మమ్ములను సంప్రదించాలని సూచించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ గ్రాడ్యుయేషన్ ఉన్నత చదువులలో కష్టపడి చదివిన వారికి పేద ,నిరుపేద విద్యార్థులకు చేయూత కార్యక్రమం క్రింద పద్మశాలి సేవ సమాజం తరపున అభినందన సభను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞాపూర్ పద్మశాలి కుల పెద్దలు తుమ్మ శ్రీను, గుండు కృష్ణ, గుండు లక్ష్మణ్, గుజ్జు వెంకటేశం, మంగళపల్లి సత్యనారాయణజిల్లా పద్మశాలి సంఘం ప్రచార కార్యదర్శి గాడి పల్లి బలరాం, జిల్లా యువజన సంఘం అధ్యక్షులు గాడిపల్లి అనూప్ ,జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పద్మశాలి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి గాడి పల్లి ఎల్లం రాజు కోశాధికారి దేవసాని హనుమన్ దాస్ సంయుక్త కార్యదర్శి పాసి కంటి శ్రీనివాస్ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు తలకొక్కుల ప్రేమ్ కుమార్ ప్రధాన కార్యదర్శి నర్సింలు కోశాధికారి గుండు మల్లేశం,రాచకొండ మహేష్, మెరుగు శ్రీనివాస్, వడ్డేపల్లి ప్రసాద్ తుమ్మ హర్షవర్ధన్ పద్మశాలి కులస్తులు యువజన సభ్యులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999